నూరేళ్ళ తెలుగు కథకు
నవ్య నీరాజనం - 22




# కథ రాయడం నాకు చేతకాదనుకున్నా!

## - ఎం.వి.రమణారెడ్డి

ఎం.వి.ఆర్‌గా పిలువబడే మల్లేల వెంకటరమణారెడ్డి సాహిత్యంలో విప్లవశంఖం లాంటి వారు. ఆయన రాసిన కథల రాశి తక్కువే అయినా, సాహిత్యకారుడిగా ఆయన కృషి అసామాన్యం. 'రాజకీయాలు కూడా వృత్తిగా చెలామణీ అవుతున్న దగుల్బాజీ వ్యవస్థలో అదే ప్రస్తుత వృత్తి' అంటున్న ఈయన చదివింది డాక్టర్‌గిరీ. కొంతకాలం వైద్యం చేశారు. రెండు పత్రికలు నడిపి 'ప్రభంజనం' సృష్టించారు. ఎన్నోసార్లు జైలుకు వెళ్లారు. జైలునుంచే అనువాదాలు చేయడం మొదలు పెట్టారు. 'రెక్కలు చాచిన పంజరం', 'పురోగమనం', 'ఆయుధం పట్టని యోధుడు', 'పరిష్కారం' కథల సంపుటం వెలువరించారు. వైద్యుడిగా, న్యాయవాదిగా, రాజకీయనాయకుడిగా, అనువాదకుడిగా, కథకుడిగా.. ఎంతో జీవన వైవిధ్యమున్న ఎం.వి.రమణారెడ్డి తన అనుభవాలను మీతో పంచుకుంటున్నారు.

## 'చందమామ', 'బాలమిత్ర'తో సాహిత్య పఠనం

మాది కడపజిల్లాలోని ప్రొద్దుటూరు. నాన్న ఓబుల్ రెడ్డి, అమ్మ వెంకటమ్మ. మేం ముగ్గురం పిల్లలం. నేనొక్కడినే కొడుకును. నాన్న బిజినెస్ చేసేవాడు. మండీ ఉండేది. అంటే జనరల్‌మర్చంట్. మా టౌన్లో మేం ధనికుల కిందే లెక్క. మాది సంపన్న కుటుంబం కావడం, అందులో కొడుకును ఒక్కన్నే కావడంతో కాస్త గారాబంగా పెరిగాను. చాలామందిలాగా నాకూ చిన్నప్పుడే 'చందమామ', 'బాలమిత్ర'తో సాహిత్యపఠనం మొదలయింది. తర్వాత నా సాహిత్యపఠనం డిటెక్టివ్ రచనలవైపు మళ్లింది. వాటిని పిచ్చిపిచ్చిగా చదివేవాడిని. తర్వాత శరత్, చలం సాహిత్యాన్ని అభిమానించేవాడిని. దీనికి తోడు మాకు హైస్కూల్లో ప్రాచీన సాహిత్యంతో బాగా పరిచయం ఉండే గడియారం వేంకటశాస్త్రి, పుట్టపర్తి నారాయణాచార్యులు, ప్రాచీన సాహిత్యాన్ని విమర్శనాత్మకంగా బోధించే వంకం సుబ్బన్న అధ్యాపకులుగా ఉండేవారు.



చిన్న కుమారుడు, కోడలు, భార్యతో....

## సినిమా వ్యాసాలతో ప్రారంభం

చాలా ఆలస్యంగా కథారచనలోకి వచ్చాను. నా రచనా వ్యాసంగం వ్యాసాలతో మొదలయింది. గుంటూరు మెడికల్ కాలేజీలో విద్యార్థిగా ఉన్నప్పుడు కొంతమంది స్నేహితులతో కలిసి 'కవిత' అనే సాహిత్య మాసపత్రిక నడిపాను. అది రెండు సంచికలతోనే చాలా ప్రఖ్యాతి గాంచింది. అందులో మొట్టమొదట నేను సినీరంగంమీద వ్యాసాలు రాయడం మొదలు పెట్టాను. కానీ, మా ఆర్థిక వనరులు సరిపోకపోవడంతో దానిని మరికొంతకాలం నడపలేకపోయాం.

## జైలులో ఉండగా మొదటి రచన

ఎమర్జెన్సీ పీరియడ్‌లో డిటెన్యూ(రాజకీయ ఖైదీ)గా వున్నప్పుడు పుస్తక రూపంలో నా మొట్టమొదటి రచన ఒక అనువాదంగా బయటకు వచ్చింది. దాని పేరు 'పురోగమనం'. నవచైనా సామాజిక పరిస్థితుల మీద డా.జాషువా ఆన్స్ అనే బ్రిటీష్ డాక్టర్ రాసిన (పుస్తకం పేరు) పుస్తకానికి అది అనువాదం. ఆ తర్వాత కూడా అనువాదం కొనసాగింది. మరో రెండేళ్ల తర్వాత యింకో సందర్భంలో జైలుకు వెళ్లాల్సి వచ్చింది. జైలులో ఉండగా ఒక స్నేహితుని ద్వారా 'పాపియాన్' నవల నాకందింది. అది పూర్తిగా జైలు జీవితం, వ్యక్తి స్వాతంత్ర్యానికి సంబంధించిన నవల. అది తెలుగులోకి అనువాదం చేస్తే బాగుంటుందని మొదలు పెట్టాను. చాలా పెద్ద నవల కావడంతో నేను జైలునుంచి విడుదలయ్యేనాటికి 40 శాతం మాత్రమే పూర్తి చేయగలిగాను. బయటికొచ్చింతర్వాత ఇతర కార్యక్రమాల్లోపడి దానిని వదిలేశాను. కొందరి మిత్రుల ఒత్తిడితో మొదటి భాగం పూర్తి చేసి ప్రచురించాను. పాఠకుల నుంచి దానికి పెద్దగా ఆదరణ దొరకడంతో మరో రెండేళ్లకు మిగతా సగాన్ని కూడా పూర్తిచేసి పూర్తి నవలగా వెలువరించాను.

## నిస్సందేహంగా కథే అని కారాగారు భరోసా ఇచ్చారు

ఈ మధ్య మరో సందర్భంలో జైల్లో ఉన్నప్పుడు కథ రాయటానికి ప్రయత్నించాను. అది సాహిత్యంలో నాకు అనుబంధంలేని ప్రక్రియ. మరో రెండుసార్లు ప్రయత్నిస్తే కథలా కాకుండా, వ్యాసంలాగా తయారయింది. దాంతో కథ రాయడం నాకు చేతకాదనుకున్నా. అయితే సమాజంలో పెరిగిపోతున్న అవకాశవాదము, దానివల్ల సమాజానికి జరుగుతున్న నష్టము ఏదో ఒక విధంగా రచనల రూపంలో తీసుకొచ్చి ప్రజల్లో చైతన్యం కల్గించాలనే కోరిక మాత్రం బలంగా ఉండేది. ఇందుకోసం ఆత్రేయ గారిని కలిసి ఆ రకంగా రచనలు చేయమని కోరాను. అలాంటి నాటకం ఒకటి ఆత్రేయగారి చేత రాయించాలనే కోరిక ఉండేది. అయితే ఆయనను కలిసే తీరిక నాకు దొరికేలోపే ఆత్రేయగారు గతించి పోయారు. మరో ప్రయత్నంలో 'యిరుకు సందు' అనే కథను మొదలు పెట్టాను. కథ సగం అయ్యాక పూర్తి చేయడానికి ధైర్యం చాలక ఆపేశాను. నేను పెరోల్ మీద బయటకు వస్తూ ఆ సగం కథనూ నాతోపాటు తెచ్చాను. అదే సమయంలో కాళీపట్నం రామారావు గారు హైదరాబాదులో ఉన్నారని తెలిసి వెళ్లి ఆ సగం కథను చూపించాను. 'యిది కథా, వ్యాసమా?' అని ఆయనను ప్రశ్నించాను. ఆయన చదివి నిస్సందేహంగా యిది కథే అని భరోసా యిచ్చింతర్వాత మిగతా సగం పూర్తి చేశాను. ఆ కథ 1989లో జ్యోతికి పంపితే వెంటనే అచ్చయింది. దాంతో ధైర్యం పుంజుకున్న నేను 'సాధ్వి' అనే రెండో కథను పూర్తి చేశాను. ఈ కథ రాయడానికి నాకు పెద్ద కష్టం అనిపించలేదు. ఎందుకంటే పౌరాణిక కథలను ఆధునిక దృక్పథంలో సమన్వయం చేయడం అనేది 'ప్రభంజనం' పత్రిక నడుపుతున్న రోజులనుండే నేర్చుకున్నాను. ఆ తర్వాత, అవకాశవాదాన్ని ప్రధానంగా ఎక్స్‌పోజ్ చేసే పద్ధతిలోనే నా కథలు సాగుతూ వచ్చాయి. యింతా చేసి నేను రాసింది పదంటే పదే కథలే!

## 'ప్రభంజనం' కాపీలన్నీ పోలీసుల దగ్గరే ఉన్నాయి

నేను మెడిసిన్ చదవడం పూర్తి కాగానే, నా సొంతూర్లో ప్రైవేట్ ప్రాక్టీసు మొదలు పెట్టా. సేవా దృక్పథంతోనే నేను వైద్యం నిర్వహించడం వల్ల, నాకు పేదజనంతో చాలా సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయి. అది వరకు సంస్కరణల పట్ల మక్కువ గలిగిన నా అభిప్రాయాలు, యిప్పుడు మరింత తీవ్రమయ్యాయని చెప్పచ్చు. దాంతో మార్క్సిస్టు సిద్ధాంతాన్ని కూడా అధ్యయనం చేయాల్సి వచ్చింది. ఆ సిద్ధాంతంతో పరిచయం ఏర్పడింతర్వాత అది పూర్తిగా నన్ను స్వాధీనం చేసుకుంది. అదే సమయంలో శ్రీకాకుళంలో

సాయుధ పోరాటం చాలా పెద్ద ఎత్తున జరుగుతోంది. అప్పట్లో ఉన్న పత్రికలు మార్క్సిస్టు సిద్ధాంతాన్ని, సాయుధ పోరాటాన్ని సమర్థించేవి లేకపోవడంతో, వాటికి సంబంధించిన వాస్తవాలు ప్రజలకు చేర్చే అవసరం ఉందనిపించింది. అప్పుడు కొందరు మిత్రుల సహకారంతో 'ప్రభంజనం' రాజకీయ పక్షపత్రికను ఎడిటర్‌గా, పబ్లిషర్‌గా తీసుకొచ్చాను. అది మంచి ప్రజాదరణకు నోచుకుంది. అయితే పోలీసు యంత్రాంగం ఆటంకం వల్ల, మాటి మాటికీ 'డిటెన్షన్' కింద నన్ను అరెస్టు చేస్తూ పోవడంవల్ల, కుంటు పడుతూ వచ్చినప్పటికీ పత్రిక నాలుగేళ్లపాటు నడిచింది. దారుణమైన విషయం ఏంటంటే, ప్రతి దఫా పోలీసు రైడింగులో, నా దగ్గర్నుండీ, నా మిత్రుల దగ్గర్నుండీ 'ప్రభంజనం' ప్రతులన్నింటినీ ఏరుకు పోయేవారు. ఆఖరికి నా దగ్గర ఒక్క కాపీ కూడా మిగల్లేదు. దాంతో పాటు నేను కొన్నవీ, సేకరించినవి అనేక రచయితల పుస్తకాలు, విప్లవానికి సంబంధం లేకపోయినా అన్నీ కట్టగట్టి ఎత్తుకెళ్ళేవారు. జైలునుంచి విడుదలై వచ్చి పుస్తకాలు వాపస్ ఇవ్వమంటే లేవనేవారు.

### అనువాదకునిగా ఎందుకు మారారు?

నన్ను అనువాదాలు చేయమని ప్రోద్బలం చేసింది సి.కె.నారాయణరెడ్డిగారు. ఆయన కూడా నాతోపాటు 'డిటెన్యూ'గా జైల్లో ఉండేవాడు. విప్లవోద్యమంలో చాలా ఏళ్ల అండర్‌గ్రౌండ్‌లో గడపడమే కాక, తన ఆస్తి సర్వస్వాన్ని ఉద్యమాల కోసం ధారపోసిన ఉత్తమ నాయకుడాయన. 'ప్రభంజనం'లో ప్రతిబింబించిన నా రచనా శైలిని శ్రీశ్రీతో సహా చాలామంది పెద్దలు అప్పట్లో మెచ్చుకునేవారు. ఆ శైలికోసమే బహుశా నారాయణరెడ్డిగారు నన్ను ఎంచుకున్నారేమో! దానికి తోడు ఆయన అనువాదం చేయమని ఇచ్చిన నవల కూడా డాక్టర్‌రాసింది. అందులో విషయాలు కూడా ఎక్కువ చికిత్సకు సంబంధించినవి వున్నాయి. బహుశా ఆ కారణంగా నాకు అనువాద బాధ్యతను అప్పగించారనుకుంటాను. ఆ తర్వాత మార్టిన్ లూథర్ కింగ్ గురించి 'ఫ్లేటో' షేజీలు చదివి 'ఆయుధం పట్టని యోధుడు' పుస్తకాన్ని రాశాను. ప్రస్తుతం 'గాన్ విత్ ది విండ్' నవలను అనువాదం చేస్తున్నాను.

### జీవితంలో మరచిపోలేని సంఘటన

నా మనస్తత్వం దేన్నీ ప్రత్యేకించి పెద్దగా పట్టించుకునేది కాదు. ప్రయత్న పూర్వకంగా దేన్నీ మరచిపోవాలనుకునేదీ కాదు. అయితే ఇదమిత్థంగా యిదీ అని గుర్తు పెట్టుకోవడం నాకు కష్టమే.

### పాఠకుని హృదయానికి హత్తుకోవాలి

కథ ఎలా ఉండాలనేదానికి కొలతలేమీ లేవు. నాకు తెలిసిందొకటే. పాఠకుని హృదయానికి ఏదయితే హత్తుకోగలదో అదే మంచి కథ. యింతకంటే కథకు ఇంకేం కావాలి? కొంతమంది శిల్పం గురించి మాట్లాడుతుంటారు. సబ్జెక్టు దానంతటదే శిల్పాన్ని ఎన్నుకుంటుంది. మనమనుకున్న అభిప్రాయమే పాఠకుడికి కలుగుతుందా లేదా అనే విషయం రచయిత చూసుకోవాలి.

### ఎవ్వరికీ సాహిత్యం పట్ల ఉత్సాహం లేదు

నాకు, లక్ష్మీకాంతమ్మకు 1966లో పెళ్లయింది. మాకు యిద్దరబ్బాయిలు, ఒకమ్మాయి. అందరికీ పెళ్ళిళ్లయ్యాయి. అందరూ స్థిరపడ్డారు. దురదృష్టం కొద్దీ నా కుటుంబంలో, సాహిత్యం మీద ఉత్సాహం ఉండేవారు ఒక్కరూ లేరు.

**-సుంకోజి దేవేంద్రాచారి**

## కరుణశ్రీ గారింట్లో కిడ్‌నేప్!



జూన్ నెలలో కన్ను మూసిన కరుణశ్రీ అన్వర్థ నామధేయులైన శ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు ఎంత సరళ స్వభావులో, మధుర మంజు భాషణా విశారదులో అంత చతుర వచో విలాసులు కూడా. తరచు కాకపోయినా, అప్పుడప్పుడు చమత్కారంగా మాట్లాడేవారు.

చాలా కాలం క్రితం సంగతి.

వాళ్ల అబ్బాయి బాపూజీ అనుకుంటా-చంటి వాడిగా ఉన్నప్పటి మాట.

ఓ రోజు 'పేరడి కింగ్'గా పేరు పడిన జలసూత్రం రుక్మిణీ నాథ శాస్త్రిగారనబడే జరుక్ శాస్త్రిగారు, ఊళ్లోంచి వెడుతున్నాం కదా అని పాపయ్య శాస్త్రిగారిని చూడ్డానికి వెళ్లారు. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. ఇంట్లో మనుష్యులు చప్పుళ్లు చెయ్యకుండా మరబొమ్మల్లా కదులుతూ ఎవరి పనులు వారు చేసుకుంటున్నారు. పాపయ్య శాస్త్రిగారేమో గంభీరంగా కూర్చున్నారు. జరుక్ శాస్త్రిగారిని చూసి 'రండి-కూర్చోండి' అని కళ్లతోటే సంజ్ఞ చేసి చెప్పారు. జరుక్ శాస్త్రిగారు ఏదో అనబోతే 'ఉష్' అంటూ పెదిమలకి వేలు అడ్డం పెట్టి 'శబ్దం చెయ్యకండి' అన్నట్లు సూచించారు. జరుక్ శాస్త్రి గారు దగ్గరగా వెళ్లి చెవిలో నెమ్మదిగా 'ఏమిటి? ఏం జరిగింది?' అని కంగారుగా అడిగారు. పాపయ్య శాస్త్రి గారు నెమ్మదిగా, గంభీరంగా 'కిడ్‌నేప్' అన్నారు. ''ఆ!'' అని జరుక్ శాస్త్రి గారు ''ఎవరిని? ఎప్పుడు?'' అని ఆదుర్దాగా అరవబోయారు. వెంటనే పాపయ్య శాస్త్రి గారు ''గట్టిగా అరవకండి. కిడ్‌నేప్ అంటే ఎవరినీ ఎత్తుకుపోలేదు. కిడ్ అంటే మా పిల్లవాడు, నేప్ అంటే కునుకుదీస్తున్నాడు. అంతే'' అంటూ చిన్నగా నవ్వారు. పాపయ్య శాస్త్రిగారి ఆ ఆంగ్లభాషా, చమత్కారం గురించి, జరుక్ శాస్త్రి గారు, ఎన్ని మార్లు మిత్రులకి చెప్పి నవ్వేరో లెక్కలేదు...

## చెప్పు సంగతి చెప్పు...



ప్రముఖ సినీ, రంగస్థల నటుడు శ్రీ పి.జె.శర్మ, ప్రసిద్ధ కవి, విమర్శకుడు ఆరుద్ర, మహాకవి శ్రీశ్రీ, వీరు ముగ్గురు సమీప బంధువులూ, ఒకరికొకరు అతి సన్నిహితులూ కూడా. వారి మధ్య కబుర్లలో శ్రీశ్రీకి సంబంధించిన ఒక ఆసక్తికరమైన సంగతి చెప్పారు శ్రీ శర్మ.

పాతిక ముప్పయియేళ్ళ క్రితం సంగతి.

మంచి నడి ఎండలో, మద్రాసు పాండీ బజారులో కాళ్ళకి చెప్పులు లేకుండా గబగబా నడిచి వెళుతున్నారు శ్రీశ్రీ. ఎదురుగుండా పేరడీకింగ్ శ్రీ జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి ఎదురు వచ్చారు. పలకరింపులూ, కుశల ప్రశ్నలూ అయ్యాయి. కాలుతున్న కాళ్ళని మాటిమాటికీ మారుస్తూ అస్థిమితంగా వున్నారు శ్రీశ్రీ. ఏమిటిది? అనుకొని కాళ్ళకేసి చూశారు జలసూత్రం. శ్రీశ్రీ కాళ్ళకి చెప్పులు లేవు.


చాలా నొచ్చుకొని ''ఏమిటిది శ్రీనివాసరావుగారు! ఏమైనా ఇబ్బందుల్లో వున్నారా? లేకపోతే కాళ్ళకి చెప్పుల్లేక పోవడం ఏమిటి? యదార్థ పరిస్థితి నాకు చెప్పండి'' అన్నారు శాస్త్రి.

''చెప్పుకొనుట కేమున్నది? ఏమీ లేదు'' అని చమత్కరించి, చిరునవ్వు నవ్వి, వేళ్ళ మధ్య వెలుగుతూన్న సిగరెట్టు ఒక్కమారు పీల్చి ముందుకి అడుగేశారు శ్రీశ్రీ.

## నాకు నచ్చిన నా కథ

# తులా మానం

- ఎం.వి. రమణారెడ్డి



రైలు రైట్టయానికి ఎక్కడ తగలబడి చస్తుందోనని భయం. అది దాదాపు అసంభవమని తెలిసినా వెళుతున్న పని అలాటిది గాబట్టి ఆందోళన. గడప దాటి బయట అడుగేస్తూనే చంటిది తుమ్మింది.

'వెనక తుమ్ము కీడు చేయదులెండి'. మా ఆవిడ భరోసా ఇచ్చింది.

చంటిది; ఏడాది పిల్ల; దాని తుమ్ము ఏపాటిది? ధైర్యం చేసి వీధి మలుపు చేరుకున్నాను. ఎంతసేపటికి రిక్షా దొరకదు! ఆర్.టి.సి. బస్టాండు ఊరవతల తగలబడింది. తుమ్ము ప్రభావం అప్పుడే సూచిస్తూంది. ప్రయాణం మానటానికి వీలులేదు. వాయిదా రోజు కోర్టులో కనిపించకపోతే వకీలు మండిపోతాడు. జడ్జి చిందు లేస్తాడు. జడ్జి గారంటే వెన్నుపూసలో వణుకు పుట్టుకొస్తుంది. చెయ్యందిస్తే కాటేసేలా ఉంటుంది అతని చూపు.

'వస్తారా బాబూ?'

ఎదుట ఆగిన రిక్షాను చూసి ప్రాణం లేచొచ్చింది. బేరం కుదుర్చుకుని బండెక్కాను. ముందు గమనించలేదు రిక్షావాడు ముసలిపీనుగని, ఎంత సేపటికి బస్టాండు రాదు. వాడు తొక్కుతుంటే చక్రాలు తిరుగు తున్నాయా అని అనుమానమొచ్చింది. తొందరపెడితే మొండికెత్తి ఆపేస్తా డని భయం.

నేనెక్కవలసిన బస్సు స్టాండులో కనబడగానే మనసు కుదుట పడింది. మా ఊరికి రైల్వేస్టేషన్ లేదు. రైలెక్కాలంటే పది కిలోమీటర్లలో వున్న పక్కూరి కెల్లాలి. రిక్షా బాడుగ చెల్లించి, సగం పరుగుతో బస్సు దగ్గర చేరాను. బస్సులో పరిస్థితిచూసి నా ఆత్రుత గాలితీసిన బుడగలా తుస్సుమంది. సీట్లలో అక్కడొకరు అక్కడొక్కరు పల్చగావున్నారు ప్యాసింజర్లు. అంతాకలిసి పదిమంది గూడా లేరు. డ్రైవరు సీటు, కండక్టరు సీటు ఖాళీగా ఉన్నాయి. వాచి చూసుకున్నాను. బస్సు కదలటానికి అరగంట మాత్రమే ఉంది. నాకు తొందరగావుంటే ప్రపంచానికంతా తొందరౌతుందా? ప్రయాణికులు నింపాదిగా వొక్కొక్కరే వస్తున్నారు.

ఖాకీ బట్టలపైన తోలుసంచి తగిలించుకుని బస్సులో కొచ్చిన మని

షిని కండక్టరుగా గుర్తించాను. అతని వాలకం చూసినకొద్దీ అసలు కండక్టరు కాదేమోననే అనుమానం కలిగిస్తూంది. కండక్టర్లకు గూడా నకిలీ లుంటారా? అతడు కారాకిల్లీ నమలడం లేదు; సిగరెట్ వెలిగించలేదు. ఆర్.టి.సి. కండక్టరు కుండవలసిన దర్జాగానీ, దర్పంగానీ అతనిలో ఏ కోశానా కనబడటం లేదు. వెనకసీట్ల నుండి నెమ్మదిగా టికెట్లు కొట్టుకుంటూ వస్తున్నాడు. డ్రైవరు సీటుమీది కెక్కాడు. రిక్షావాడిలాగే ముసలి పీనుగు దాపురించాడేమోనని చూశాను. కాదు; చాకులాటి కుర్రాడు. ప్రమాదమేదీ జరక్కపోతే పది నిమిషాల్లో గమ్యం చేర్చేలా ఉన్నాడు. ప్రస్తుతం అలాటివాడే అవసరం. రైలు దాటిపోకుండా అందించాలి.

స్టీరింగ్‌ను రెండు చేతులతో ముట్టి కళ్ళకద్దుకున్నాడు. తన సీటు కెదురుగా బిగించుకున్న చిన్న దేవుడిపటానికి దండం పెట్టుకున్నాడు. ప్రయాణికులకు అల్టిమేటం ఇస్తున్నట్టుగా హారన్ బయ్యిమని వాయించాడు. హారన్ మోత వినగానే, బాతాఖానీ కొడుతూ ప్లాట్‌ఫారం మీద నిలబడిన ప్యాసింజర్లు, కిల్లీకొట్టు దగ్గర డిటెక్టివ్ పుస్తకాల ముఖచిత్రాలు ఆస్వాదిస్తున్న ప్యాసింజర్లూ వొక్కసారిగా ఎగబడ్డారు.

కొందరికి బస్సు కదిలేంతవరకు లోపలికెక్కే అలవాటుండదు. మనను కాదని అదెక్కడికి వెళుతుందనే ధీమా కనిపిస్తుంది వాళ్ళ ఫోజులో. తెలుగుదేశంలో ఏ మూలకెళ్ళినా ఈ తరహా ప్రవర్తన సర్వసాధారణంగా కనిపిస్తుంది. దాన్ని ధీమా అనాలో, పొగరు అనాలో నాకైతే అర్థంగాదు. సినిమాపోస్టరు చూస్తూ నడిరోడ్లో నిలబడి వుంటాడొక మనిషి. దూరం నుండి హారన్ వినపడినా కదలడు. ఆ బస్సో లారీనో నాలుగు బార్ల దూరంలో కీచుమంటూ ఆగిందాకా తొలగడు. ఆగిన డ్రైవరువైపు నిర్లక్ష్యంగా చూస్తూ నెమ్మదిగా తప్పుకుంటాడు. తనేదో దయదలచి దారి వదులుతున్నట్టుంటుంది అతని ప్రవర్తన. దీనివల్ల తనకు గొప్పతనం వచ్చినట్టనుకుంటాడో, లేక ఉన్న గొప్పదనాన్ని నిలుపుకున్నట్టనుకుంటాడో మనకు తెలీదు. ఎదుటివారికి ఎంత చిరాకు కలుగుతుందో అతనికి తెలీదు. అహంభావం తెలుగుజాతికి తరతరాలుగా సంక్రమిస్తున్న సంపద!


కోదండమని నాకో స్నేహితుడున్నాడు. తెలుగోడే. కానీ వాడికెందుకో ఆంధ్రులన్నా, ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ బస్సులన్నా చాలా చులకన. ఆర్.టి.సి. బస్సులను ప్రవేశపెట్టిన రోజుల్లో వాటిని గురించి ఒకటే ఎగతాలి. పనిమీద వేరే ఊరెళ్ళి ఆర్.టి.సి. బస్సులో తిరిగొచ్చాడొక రోజు.

'ఎలా సాగిందోయ్ ప్రయాణం?' మెచ్చుకుంటాడనే ఆశతో అడిగాను.

'అరాచక జనానికి, ఆర్.టి.సి. కండక్టర్లకు అద్భుతంగా సరిపోయింది' అన్నాడు పగలబడి నవ్వుతూ.

నేను చిన్నబుచ్చుకున్నాను. వాడు పరోక్షంగా తిడుతున్నది నన్నే. బస్సు రూట్లను జాతీయం చేయడాన్ని నేను సమర్థించేవాడిని. వాడందుకు వ్యతిరేకి. బాధ్యతెరుగని మన జనానికి జాతీయకరణ సరిపడదని వాడి వాదన. వాడికేం తెలుసు, తరచు ప్రయాణం చేసే నాబోటి వాడికి తెలుస్తుంది ప్రైవేటు బస్సుల్లో అనుభవించే నరకం.

మా ఊర్లో ఆర్.టి.సి. బస్టాండుకు ప్రారంభోత్సవం జరిగిన రోజు నా సంతోషానికి సరిహద్దు లేదు. రవాణామంత్రి స్వయంగా వచ్చి రిబ్బను కత్తిరించాడు. మా ఊరు మొత్తంలో అంత అందంగా కనిపించే భవనం మరొకటి లేదు. పెద్దపెద్ద స్తంభాలూ, విశాలమైన వసారాలూ, అద్దంలా ప్రతిబింబం కనిపించే నల్లరాతి చప్పట, లోపలే భోజన వసతి! – వైకుంఠం మా ఊరికి దిగివచ్చినట్టనిపించింది.



ప్రైవేటు బస్సులకు స్టాండా పాడా? మునిసిపాలిటీ మొండిగోడలకు తుప్పు పట్టిన రేకులు కప్పితే బస్టాండని పిలిచే వాళ్ళం. కొత్తదానికి అది దిష్టిబొమ్మలా ఉంటుంది.

ప్రైవేటుబస్సు మొక్కుబడి కోసం పాతబస్టాండు తగిలి కదిలొచ్చేది. ప్రయాణం చేసే దిశగా మంచి రద్దీవుండే బజార్లో నిలబడుతుంది. అదే దాని అసలు బస్టాండు. టీ కొట్ల బల్లలనూ, వరండాలనీడలనూ ఆశ్రయించుకొని ప్రయాణికులు దానికోసం ఎదురు చూస్తుంటారు. బస్సాగగానే మూటెలూ, మల్లెలు ట్రంకుపెట్టలతో వొకటే ముట్టడి. సీట్లలో, నడవలో, డ్రైవరుసీటు సగంలో ఇరికించింది చాలక, ప్యాసింజర్లను బస్సుటాప్ మీదగూడా కూర్చోబెడతారు. వాటికి డిపార్చరు సమయం లేదు. వెనక బస్సొచ్చి బలవంతంగా సాగనంపితే గాని స్టాండు వదలడు. ఊరి పొలిమేర దాటినంతవరకు మెల్లిగా నడిపిస్తూ, ఎదురైన ఏ ప్యాసింజరును విడిచి పెట్టకుండా కుక్కుతుంటారు. దారి పొడవునా స్టాపులే. నల్ల కుక్క చెయ్యెత్తినా ఆపి ఎక్కించుకోవలసిందే. అది అంతం లేని కక్కుర్తి; అసహ్యం వేసే కక్కుర్తి. ఎంతమంది ఎక్కినా చోటు మిగిలుండేది పుష్పక విమానమైతే, చోటులేకుండా ఎంతమందినైనా ఎక్కించుకునేది ప్రైవేటు బస్సు. ప్రయాణం పూర్తయి ఇల్లు చేరేసరికి వొళ్లంతా గుల్లవుతుంది.

నా బాధలకు ఉపశమనంగా ప్రవేశించిన వరప్రసాదం ఆర్.టి.సి. అనుకున్నాను. (తొలి రోజుల్లో) సీట్లవరకే టికెట్లు; స్టాండింగ్ లేదు; స్టేజి దగ్గర తప్ప ఆపేదిలేదు; టైం ప్రకారం ప్రయాణం. ఆర్.టిసి. వల్ల ఇన్ని వసతులు ఏర్పడినా కోదండానికి అవంటే ఎగతాలి.

ప్రైవేటుబస్సుల భయంకరమైన అనుభవం నన్ను ఆర్.టి.సికి మిత్రునిగా చేర్చింది. నా ఖర్మ బాగాలేక, రెండు ప్రైవేటు బస్సులు స్టాండులో వుండే టైంలో వెళ్ళానొకసారి. టైం ప్రకారం వదలక తన ప్యాసింజర్లను ఊడ్చుకు పోతున్నాడనే ఆక్రోశంతో ముందు బస్సు కండక్టరును వెనుకబస్సు కండక్టరు బండబూతులు తిడుతున్నాడు. ఆరోజు నన్ను సాగనంపటానికి కోదండం గూడా నాతో వచ్చాడు. ముందు బస్సు మెల్లిగా నడుస్తూంది. తిట్లను ఏ మాత్రం ఖాతరు చెయ్యకుండా ప్యాసింజర్లను ఆహ్వానిస్తున్నాడు ముందుబండి కండక్టరు.


'రా సార్! ఇది ముందు పోతుంది'.

ముందుబస్సు కండక్టరు పిలుపుకు స్పందించి, కదిలేబండిని అందుకోవాలని ముందుకు దూకబోయాను. రెండో కండక్టరు నా జబ్బ పట్టుకుని వెనక్కులాగాడు. దౌర్జన్యానికి దిమ్మతిరిగి అతని ముఖంలోకి చూశాను. అతడు నన్ను లక్ష్య పెట్టినట్టు లేదు. 'మాదచ్చోద్' మొదలైన పదజాలంతో తిట్ల వర్షం కురిపిస్తున్నాడు. నన్ను గాదుగానీ, ఆ యుద్ధమంతా నా గురించే. ముందుబస్సు స్టాండు వదిలే టైం దాటిపోయింది. అందువల్ల, నా ప్రయాణం మీది సర్వహక్కులు రెండో వాడివే గానీ, ముందోనివి కాదు. 'పోరా' అన్నట్లు నిర్లక్ష్యంగా చెయ్యి ఎగిరేసి వెక్కిరిస్తూ సాగిపోతున్నాడు చక్రవర్తి అక్బర్‌లాగా ముందోడు. కందగడ్డలా ఎర్రబడిన ముఖంతో తన బస్సువైపు చెయ్యిచాపి, లోపల కూర్చోండి అంటూ ఆజ్ఞాపించాడు షాజహాన్ చక్రవర్తిలా రెండోవాడు. అంతకు మించి ఏమీ అనలేదు గాబట్టి, అతడు నన్ను గౌరవించినట్టు సంతోషించాను. కోదండం విరగబడి నవ్వుతున్నాడు. వాడి కన్నీ నవ్వులాటగానే వుంటాయి.

ఆంధ్ర ప్రజానీకంలోనూ, ఆర్.టి.సి కండక్టర్లలోనూ కోదండానికి కనిపించిన వింతలేమిటో తెలుసుకోవాలని కుతూహలం కలిగింది.

'చెబుతా రా' అంటూ కాఫీ హోటల్లోకి లాక్కెల్లాడు. కాఫీ ఆర్డరిచ్చి చెప్పటం మొదలెట్టాడు.

'చెన్నూరు దగ్గర వొక ముసలాయన బస్సెక్కాడు. చంకలో కోడిపెట్ట. కండక్టరు డబ్బడిగాడు. బొగ్గిట్లో దోపిన మూట విప్పి, చిల్లర జాగ్రత్తగా లెక్కబెట్టి ఇచ్చాడు.



'ఎక్కడ దిగుతావ్?' కండక్టరు అడిగాడు.

ముసలాయన చెప్పాడు.

'ఇది నీ ఛార్జీకి సరిపాయె!'

'బస్సెక్కింది నేనొక్కన్నే'

'కోడి పెట్టో'

'దీనిగ్గూడానా?'

'గవర్నమెంటు రూలు'.

'ఇది నా చంకలో వుంది. నీకేం సంబంధం?'

'నువ్వు నా బస్సులో వుండ్లా?'

'దీనికెంత?'

'పది రూపాయలు'

'ఇదయ్యేది ఐదు రూపాయలు'.

'గవర్నమెంటు రూలు. నా చేతుల్లో ఏముంది?'

రైతుకు వొల్లు మండింది. నీ ఛార్జీకి రెండొస్తాయని గొనుక్కుంటూ కోపంగా కోడిపెట్టను బయటికి విసిరేశాడు.

కోదండానికి మళ్లీ నవ్వు దొంతర.

'ఇందులో పగలబడి నవ్వేంత హాస్యమేముంది? కండక్టరు రూలు ప్రకారం అడిగాడు. రైతుకు అది లాభసాటిగా లేదు. ఎవరిపాటికి వారిది సబబే!'

'అర్థమయ్యే తెలివుంటే నువ్విట్లెందుకుంటావ్‌లే' కాఫీకప్పు అందు కుంటూ కోదండం వెక్కిరించాడు. నా పాలిటికి అదొక విచ్చుకథ అయింది.

'మరొక తమాషా చెప్పనా?' కాఫీ చప్పరిస్తూ అడిగాడు కోదండం. ఆమోదం తెలుపుతూ తలూపాను.

'రంగాపురం నుండి ఇల్లూరు ఎంత దూరం?'

'కిలోమీటరు గూడా ఉండదేమో'

'ఔనా, రెండు స్టేజిలకూ చార్జీ వొకటేనా?'

ఔనని తలూపాను.

'రంగాపురం మనిషి బస్సెక్కాడు. చార్జీ ఎంతని అడిగాడు. రూపాయి న్నర అవుతుందని కండక్టరు చెప్పాడు. ఇల్లూరి కెంతని అడిగాడు. అదే అంతే అన్నాడు కండక్టరు. మావూరు ఇల్లూరికి ఇవతలే ఉందిగాబట్టి పావలా తక్కువిస్తానంటాడు ఆ మనిషి. కుదరదంటాడు కండక్టరు. రోషం పెరిగింది. కండక్టరు చేతిలో రూపాయిన్నర పెట్టి ఇల్లూరే దిగుతా నన్నాడు'.

'అతంది రంగాపురం గదా?'

'ఇల్లూరి దిగి వెనక్కి నడిచి వెళతానన్నాడు'

'అదేం పిచ్చి?' నాకు నవ్వొచ్చింది.

'తన పంతం నెగ్గలేదని కసి'. నవ్వు ఆపుకోలేక కోదండానికి దగ్గుపొర వచ్చింది. నోట్లో కాఫీ టేబులుమీద చిమ్మింది. నా బట్టల మీద పడకుండా వెనక్కు తప్పుకున్నాను.

కోదండం చెప్పిన రంగాపురం వాసి అప్పుడప్పుడు గుర్తుకొస్తుంటాడు. అతని ఆంతర్యం నాకు వొకపట్టాన బోధ పడటం లేదు. అది అతితెలివా, మూర్ఖత్వమా, అహంకారమా, అమాయకత్వమా? వెనక్కు నడిచి రాగానే అతని కసి తీరిందా? చార్జీ వృధాకాకుండా సద్వినియోగం చేశాననుకుంటున్నాడా?

'ఎక్కడికి సార్?'

కండక్టరు ప్రశ్నతో వర్తమానంలో వచ్చిపడ్డాను. మంచివాడులా ఉన్నాడు. ఇంట్లో చొక పెళ్ళాన్ని దబాయించినట్టు 'ఎక్కడికి?' అని పెన్సిల్‌తో భుజం మీద తట్టకుండా, మర్యాదగా అడుగుతున్నాడు. గమ్యం తెలిపి డబ్బులిచ్చాను. ఛార్జీకి సరిపడా చిల్లర ఉంచుకోవటం నా అలవాటు. తొందరగా పని తెగుతుంది. పైగా, అది కండక్టరుకు మనం చెయ్యగల చిన్న సహాయం. ప్రయాణానికి సంబంధించిన నీతి సూత్రాలు బస్సులో అందరికీ కనిపించేలా వ్రాసుంటారు. సరిపడే చిల్లర ఉంచుకోవాలనేది వాటిల్లో వొక నీతి.

నా పక్కసీట్లో కూర్చున్న సిల్కు జుబ్బా, జరీ కండువా మనిషిని అడిగాడు. సిల్కుజుబ్బా జేబిలో నుండి వంద రూపాయల నోటు బయటి కొచ్చింది.

'చిల్లరంతా మీకే సరిపోతుంది సార్' చిరునవ్వుతో తన కష్టాన్ని నివేదించాడు కండక్టర్.

'ఇవ్వాలోయ్. అది నీ ఉద్యోగం' జరీ కండువా దబాయించింది.

'ఫస్ట్ ట్రిప్పు సార్. చిల్లర తక్కువగా వుంటుంది'

తన బాధ చెప్పుకుంటూ కండక్టరు పెద్దనోటు అందుకుని చిల్లర నోట్లు వెదికి

వెదికి సరిపెట్టాడు. టికెట్ కొట్టి ముందుసీటువైపు కదిలాడు.

ముందు సీట్లో వున్న కుర్రాడు కాలేజీస్టూడెంటులా ఉన్నాడు. ఎక్కడికి వెళ్ళాలో చెబుతూ వందరూపాయల నోటు అందించాడు. రెండోసారి పెద్దనోటు చూస్తూనే కండక్టరు జడుసుకున్నాడు.

'రెండురూపాయల టికెట్టుకు అంతపెద్ద నోటెందుకు సార్? చిల్లరుంటే ఇవ్వండి' ఒదిగి చెప్పుకున్నాడు కండక్టరు.

'చిల్లర లేకనే' చిరాగ్గా జవాబిచ్చిడు స్టూడెంటు.

'అందరూ పెద్దనోట్లిస్తే ఎంతని చిల్లర తీసుకురావాలి సార్?''

'ఎవరి కోసం తెస్తావ్? నీ కోసం చిల్లర నోట్లు మూటగట్టి సంచి తగిలించు కోవాలా?'

'చదువుకున్నోళ్ళు మీరే అట్లంటే ఎలా సార్?'

'చదువుకున్నాం గాబట్టే నీ బాధ్యతేమిటో తెలిసేటట్టు చెబుతున్నాను. బస్సులో చిల్లరనోట్లు తప్ప పెద్దనోట్లు చెల్లవని చట్టం చేశారా?'

'చట్టం గురించి కాదు సార్. నా దగ్గర చిల్లరలేక అడిగాను'.

ఈ వాదన తెగేదెప్పుడు, బస్సు కదిలేదెప్పుడు? ఇప్పటికి పది నిమిషాల లేటు. కంగారు తిరగదోడింది. పొరపాటున రైలు సమయానికి వస్తే? ఆలస్యమై పోతుందనే ఆలోచన ఇతర ప్రయాణికుల్లో అవగింజంతైనా కనిపించలేదు. పత్రికలు చూసుకుంటూనో, పక్కవాడితో కబుర్లు చెప్పుకుంటూనో వినోదిస్తున్నారు. ఈ గొడవ పట్టనట్టు నటిస్తున్నారు. పాపం, కండక్టరు దగ్గర నిజంగానే చిల్లర లేదు. జేబులో నుండి చిల్లర నోట్లు పైకితీస్తూ అతన్ని పిలిచాను–

'బాబూ, నా దగ్గరుంది. ఇలాతే'

కండక్టరు ధన్యవాదాలు చెప్పుకున్నాడు.

ఒక గండం గడిచిపోయిందనుకుంటే రెండోది హఠాత్తుగా వచ్చిపడింది. డ్రైవరు సీటుకు వెనకవైపు, స్త్రీలకు కేటాయించిన సీటులో వొక పెద్దమనిషి విశ్రాంతిగా కూర్చున్నాడు. పురుషుల సీట్లలో ఖాళీ లేకగాదు, ఆయన కెందుకో అక్కడే కూర్చోవాలనే కోరిక కలిగినట్టుంది. తీరా కదిలేముందు ఇద్దరాడవాళ్ళు బస్సెక్కారు.

'ఇది ఆడవాళ్ల సీటు సార్. మీరు అలావెళ్ళి మరోసీటు చూసుకోండి సార్' కండక్టరు విజ్ఞప్తి చేశాడు.

'ఏం, అలా రాసుందా?''

'పైకి చూడండి సార్, స్త్రీలు అని వ్రాసుంది'

'ఖాళీగా వుంటే కూర్చున్నాను'

'ఆడాల్లు నిలబడి పోయారు సార్'

'ఆలస్యంగా రావటం వాళ్ల తప్పు'

'వాళ్లకు కేటాయించిన సీట్లు గదండి. ఎప్పుడొచ్చినా మనమే లేచిపోవాలి'

'స్త్రీలకు కేటాయిస్తే పురుషులు కూర్చోగూడదని ఎక్కడుంది? పురుషుల సీట్లల్లో ఆడవాళ్ళు కూర్చోవటం లేదా?'

కండక్టరు అసహాయంగా ఆడవాల్ల వైపు తిరిగాడు. అప్పటికే అర్ధగంట ఆలస్యమైంది. నాకు ఓర్పు సన్నగిల్లింది. అయినా చేయగలిగేదేముంది? ఫటాఫటా వాయించడానికి ఇది సినిమా గాదు, నేను హీరోనూ గాదు. ఇంతసేపు నోరు మెదపకుండా కూర్చున్న డ్రైవరు అనాథ రక్షకునిలా రంగంలో దూకాడు.

''సిగ్గులేదా ముసలోడా. ఆడోళ్ళసీటని మెత్తుకుంటున్నా ఆడనే ఉంటానంటావ్. కిందాపైనా నెరిసినా బుద్ధిమటుకు రాలా?''

'ఏమిటోయ్ అతిగా వాగుతున్నావ్?' పెద్దమనిషి ఉగ్రుడైనాడు.

'అతీగాదు గితీగాదు. ఎక్కువ మాట్లాడితే మెడబట్టి కిందికితోస్తా. సీటుగాబట్టి సరిపోయింది. ఆడోల్ల మరుగుదొడ్లో దూరేవ్. మక్కె లిరగదంతారు' డ్రైవరు రెచ్చిపోయాడు.

ప్రయాణికులంతా కిసుక్కుమని నవ్వారు. ముసలాడి ముఖం అవమానంతో ఎర్రబడింది. బస్సు దిగి వెళిపోతాడేమననుకున్నాను. తోక ముడిచి వెనకసీటు వెదుక్కుంటూ వెళ్ళాడు. అంత అవమానం భరించి అందులోనే వస్తున్నాడంటే అతనికెంత అర్జంటు పనులున్నాయో! డ్రైవరు శాంతపడి ఇంజను స్టార్ట్ చేశాడు. హమ్మయ్య! బస్సు కదుల్తాంది.

ఊరు దాటగానే బస్సు వేగం పుంజుకుంది. దారిపక్కన చెట్లు వెనక్కు పరిగెడుతున్నాయి. చిన్న విషయాలకు అనవసరంగా పట్టుదలకు పోయే మనస్తత్వాల గురించి నాలో అంతర్మథనం జరుగుతూంది. అనకువగా వుండే వానిపైన అవతలివాడు చెలరేగుతున్నాడు; మొత్తేవాణ్ణి జూస్తే దండంబెట్టి లొంగిపోతున్నాడు. త్రాసులో ఎల్లకాలం వొక సిబ్బి పైకి, మరొక సిబ్బికిందికి మారవలసిందేనా? సమతూకం, సామరస్యం. ఎప్పటికైనా సాధ్యమా? మానవ సమాజానికి అడవికీ తేడా లేదా?

సడన్ బ్రేకుతో బస్సు వంతెనమీద ఆగిపోయింది. ఎగిరిపడి ఎదురుగా చూశాను. బస్సుకడ్డంగా పదిగజాల దూరంలో లారీవొకటి ఆగిపోయింది. లారీ వంతెన మీదికి ఎక్కబోతూంది. బస్సు వంతెన చివరకు చేరుకుని దిగబోతూంది. పాతకాలం వంతెన. రెండు బండ్లు ఎదురెదురుగా దాటుకోలేవు. లారీని వెనక్కు తీయమంటే ఆ డ్రైవరు వినిపించుకోడు. ఎంత బ్రతిమాలినా వినకుండా ఆపి కూర్చున్నాడు. కొంత మంది ప్యాసింజర్లు మధ్యవర్తిత్వం నెరిపారు. ఫలించలేదు. క్లీనరుకు రెకమెండేషన్ పెట్టారు. నోరు మూసుకోమని క్లీనరుకు లారీ డ్రైవరు చీవాట్లు పెట్టాడు. వెనక్కుతీస్తే తనకు పరువు తగ్గుతుందని లారీ డ్రైవరు భీష్మించాడు. ఊరుగాని ఊర్లో, నేలగాని నేలలో తన పరువుకు ధ్వజస్తంభం నాటించి ఏం సాధించాలనుకున్నాడో ఆ నాయకుడు! మేమెవ్వరం అతన్నెరుగం. ఆ క్షణం దాటిపోతే అతడెవరో మాకు అనవసరం. ఇదంతా నా ఖర్మకోసం వచ్చినట్టుంది. పిల్లదాని తుమ్ము బలంగా పని చేస్తూంది.

మా వెనుక జీపొకటి వచ్చి ఆగింది. అందులో అంతా యువకులు; ఆగమంటే ఆగేట్టు లేరు. దారి చెయ్యమని హారన్‌తో రొద పెడుతున్నారు. మొగుడు చచ్చి మెత్తుకుంటూంటే మిండగాడు తొందరపడిన సామెతగా వుంది పరిస్థితి. బస్సు కదలక ఏడుస్తూంటే వెనక ఇదో అల్లరి. యువకులు జీపుదిగి అసహనంగా ముందుకు వచ్చారు. లారీ వెనక్కు తప్పుకోవడమే వారికి గూడా న్యాయంగా తోచినట్టుంది. లారీ డ్రైవరు వాళ్ళనూ ఖాతరు చెయ్యలేదు. యువకులు లారీ మీదికి ఎగబడ్డారు. చొక్కాబట్టి డ్రైవరును కిందికి లాగారు. రోడ్డుమీది కీడ్స్ బూటుకాల్లతో పచ్చడి చేశారు. లబో దిబో ఏడుస్తూ డ్రైవరు పారిపోయాడు. క్లీనరుకు అంతకు ముందే పరారైనట్టుంది. గేరు న్యూట్రల్ చేసి, లారీని తగ్గుకు నెట్టారు. రోడ్డు దిగి వెనక్కు దొర్లుకుంటూ లారీ పొలంలో ఇరుక్కుపోయింది. బస్సు కదిలింది. కానీ గంటా పది నిమిషాలు లేటు.

స్టేషన్ దగ్గర బస్సు ఆగగానే హడావిడిగా దిగి, లోపలికి పరిగెత్తాను. రైలు వెళ్ళిపోలేదని తెలిసి గుండె తేలికపడింది. మరో గంటకు గానీ రైలొచ్చే ప్రమాదం లేదని గూడా తెలిసింది. ప్లాట్‌ఫారం బల్లమీద విసుగ్గా కూలబడ్డాను. స్టేషన్ మాస్టరు గది బయట, గోడ మీద రాసున్న టైం టేబుల్ మీద నా చూపు పడింది. కాలక్షేపానికి పైన్నుండి కింది దాకా చదువుతూ వచ్చాను. అందులో వ్రాసిన గమనికలో నాకేదో వింత స్ఫురించింది.

"Trains are likely to gain or loose time"

అంటే, రైలుబళ్ళు వేళకు ముందుగానీ ఆలస్యంగా గానీ వచ్చే అవకాశం ఉందని అర్థం. ముందుగా వచ్చిన దాఖలాలు లేవు గానీ ఆలస్యంగా రావడం తథ్యం. పాపం శమించుగాక! ఆలస్యంగా రావడం మన రైళ్ళకు అలవాటై సరిపోయింది గానీ, అందులో రాసినట్టు వొకరోజు వేళకంటే ముందూ, మరొకరోజు వేళకు వెనక, అంటే ఎప్పుడు బడితే అప్పుడన్న మాట, రావడమే జరిగితే ప్రయాణికుల పాట్లు ఇంకెన్ని విధాలుగా వుండేవో!

❑

**(ఇండియా టు డే, మే 21 1993)**

## కథాంతరంగం



నచ్చిన కథంటూ ఒకటి ప్రత్యేకంగా ఏ రచయితకయినా ఉంటుందా అని నా సందేహం. ఏ రచయిత అయినా తన రచనను స్పందించే రాస్తాడు. ఏదైనా ఒక కథ పాఠకులకు నచ్చకపోవచ్చేమోగాని, రచయితకు నచ్చని కథ ఒకటి ఉందీ అంటే అది తన బిడ్డల్లో ఒకరిపట్ల తల్లి చూపే పక్షపాతం లాంటిదే. అయితే శిల్పపరంగా నచ్చిన కథ 'తులామానం'. సమాజంలో మంచిని మంచిగా గౌరవించే అలవాటు తప్పిపోయినందువల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో వ్యక్తుల మధ్య సమతౌల్యం తప్పుతోందనే అభిప్రాయాన్ని తెలిపే సందర్భాలతో ఈ కథ కూర్చడం జరిగింది.

**–ఎం.వి.రమణారెడ్డి**
**ఫోన్ : 08564-254747**